రూ.450 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


రైతుబజారు ప్రారంభోత్సవ కార్యక్రమంలో శిలాఫలకాలు ఆవిష్కరిస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలి మున్సిపాల్టీగా ఉన్నప్పుడు దీని బడ్జెట్ రూ.4 కోట్లు ఉంటే ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇదే జోన్‌లో సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.450 కోట్లు ఖర్చు చేసినట్టు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. చిట్టివలసలో రూ.78 లక్షలతో నిర్మించిన రైతుబజారును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరల పెరుగుదలపై ప్రతిపక్షాలు చేస్తున్న రాద్ధాంతానికి అర్థం లేదన్నారు. ఉక్రెయిన్-రష్యా, గాజా-ఇజ్రాయిల్ యుద్ధాల ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా పడిందన్నారు. పారదర్శకరంగా అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్టు చెప్పారు. 95 శాతం మందికి పథకాలు అందాయన్నారు. వీటిని నిలుపుకొనే అవకాశం ప్రజలకే ఉందన్నారు. పథకాలు కొనసాగాలంటే మోసకారి చంద్రబాబు, పవన్‌ల మాటలు నమ్మకుండా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీనే గెలిపించుకోవాని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి జెడ్పీ కనకమహలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, 2వ వార్డు ఇన్‌చార్జ్ శిల్లా కరుణాకరరెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, ఎంపీపీ కె.రాంబాబు, బంక సత్యం, ఏఎంసీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, కార్యదర్శి బి.లక్ష్మి చైతన్య, డైరెక్టర్లు భాగం సుధాకర్, రౌతు శ్రీను, పల్లా అప్పారావు, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నాయకులు డబ్బీరు ప్రశాంతి, చిల్ల సూర్యనారాయణరెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, జీరు సుజాత, చిల్ల హరి, అక్కరమాని అప్పలనాయుడు, కొప్పల రమేష్, దంతులూరి వేణు, ఎలమంచిలి మురళీకృష్ణ, చిల్ల ప్రమీల, సరగడ నాగిరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, మునకాల ఆదినారాయణరెడ్డి, చేట్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

భీమునిపట్నం: సచివాలయ సిబ్బంది బాధ్యతతో విధులను నిర్వర్తించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడ తన క్యాంపు కార్యాలయంలో నాలుగు వార్డులకు చెందిన సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విశేష సేవలందిస్తున్నారని చెప్పారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల వల్ల ప్రజలు ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ముందుచూపుతో అన్ని వర్గాలవారికి మంచి జరగాలన్న ఉద్దేశంతో ఈ వ్యవస్థలను ప్రవేశ పెట్టారన్నారు. ఇకపైకూడా అందరూ బాధ్యతగా విధులు నిర్వర్తించడం ద్వారా ప్రభుత్వానికి, సీఎం జగన్ మోహన్‌రెడ్డికి మంచి పేరు తేవాలన్నారు. వలంటీర్ల సేవలను గుర్తించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారికి సత్కరించారని, అదే తరహాలో స్థానిక వలంటీర్లనుకూడా రెండు రోజుల్లో సత్కరించనున్నామని చెప్పారు. ఈ సమావేశంలో నాలుగవ వార్డు కార్పొరేటర్ దొలుపల్లి కొండబాబు, జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ కొప్పల ప్రభావతి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న పశు వైద్యాధికారి కన్నయ్యనాయుడు

ఆనందపురం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పశు బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని శొంఠ్యాం పశువైద్యశాల అధికారి ఎల్.కన్నయ్యనాయుడు సూచించారు. మండలంలోని పాలవలస రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం పశు విజ్ఞానబడి నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నయ్య నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతులు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకందారులకు నూతన పశు బీమా పథకం అమలు జరుపుతోందని తెలిపారు. ఈ పథకంలో లబ్ధిదారుల వాటా ఎస్సీ, ఎస్టీ, బీసీలు 20 శాతం, ఇతరులకు 50 శాతంగా నిర్ణయించినట్టు చెప్పారు. మూడేళ్ల వ్యవధిగా ఆవు, గేదెలకు రూ.30వేలు, రూ.15వేల చొప్పున బీమా చేయించుకునే వెసులుబాటు ఉందన్నారు. గొర్రెలు, మేకలకు ఏడాది, రెండేళ్లు, మూడేళ్లకు రూ.6 వేలు వరకూ బీమా చేయించుకోవచ్చని తెలిపారు. ఒక రైతు కుటుంబం గరిష్టంగా 5 గేదెలు, 50 గొర్రెలు మేకలకు బీమా చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. పరిశుభ్రమైన పాల ఉత్పత్తి కోసం, ఆడ పెయ్యిలను పుట్టించే ఇంజక్షన్లు, సబ్సిడీపై అందించే సమీకృత ఆహారం సరఫరా వంటి వాటి గురించి రైతులకు అవగాహన కల్పించారు. పాడి రైతులకు సంబంధించిన అన్ని సేవలను రైతు భరోసా కేంద్రాల ద్వారా పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మామిడిలోవ డెయిరీ అధ్యక్షుడు బలిరెడ్డి మహేష్, ఏహెచ్‌వో రఘురాం, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురవాడ: మారికవలస జేఎన్ఎన్‌యూఆర్ఎం ఆర్‌జీకే కాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మధురవాడ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరేష్ చెప్పారు. మారికవలస జంక్షన్, మారికవలస ఆర్‌జీకే కాలనీ, శారదానగర్, పీఎం2 కాలనీ, గాయత్రీ ఆస్పత్రి, వైఎస్సార్ కాలనీ, కొమ్మాది పెట్రోల్ బంక్, వికలాంగుల కాలనీ, కార్పెంటర్స్ కాలనీ, స్వయంకృషి నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరేష్ కోరారు.

జోన్-2 కమిషనర్‌గా శైలజ


జోనల్ కార్యాలయంలో శైలజ వల్లికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

మధురవాడ: జీవీఎంసీ జోన్-2 కమిషనర్‌గా శైలజ వల్లి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెకు జోన్‌కు చెందిన ఈఈ శాంతిరాజు, ఏపీడీ గంగాధర్ పలువురు సిబ్బంది, అధికారులు దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ఈమె భీమిలి జోన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన దాట్ల లక్ష్మి యూసీడీ విభాగం పీడీగా వెళ్లారు. మధురవాడలో పనిచేసిన కనక మహాలక్ష్మి మెయిన్ ఆఫీసుకు ఏవోగా బదిలీ అయ్యి, అక్కడ నుంచి భీమిలికి వెళ్లారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు


సూర్య ప్రభ వాహనంపై శ్రీవారు

భీమునిపట్నం: రథ సప్తమి సందర్భంగా శుక్రవారం కృష్ణకాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారిని సూర్యప్రభ వాహనంలో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, రేలంగి పెదబాబు, ఎం.సత్యానందం, కె.ముత్యాలరావు, కె.సన్నిబాబు, బాలాజీ, ఆనంద్, అప్పన్న పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు


పట్టు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకుని వెళ్లి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

19న గెస్ట్ అధ్యాపకుని పోస్టుకు ఇంటర్వ్యూ

భీమునిపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ సబ్జెక్ట్ బోధించడానికి అతిథి అధ్యాపకుని నియమించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ మంజుల శుక్రవారం తెలిపారు. పీజీ ఎకనామిక్స్‌లో కనీసం 55శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించినవారు దీనికి అర్హులని చెప్పారు. అర్హత కలిగిన వారు 19వ తేదీ ఉదయం 11గంటలకు కళాశాలవద్ద జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు.

వామపక్ష కార్మిక సంఘాల ఆందోళన


తగరపువలసలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



మధురవాడలో నిరసన తెలుపుతున్న కార్మికులు

తగరపువలస: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తునన కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం వామపక్ష కార్మిక సంఘాలు అంబేడ్కరు కూడలిలో ర్యాలీ, మానవహారం నిర్వహించాయి. ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్.ఎస్.ఎన్. మూర్తి మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. పంటలకు కనీస మద్దతు ధర, ఆహార భద్రత చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్.అప్పలనాయుడు, దుర్గా, లక్ష్మి, పార్వతి, దుర్గారావు, నరసింగరావు, ఇంటి రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: రవాణా రంగ కార్మికులకు నష్టం కలిగించే కేంద్రప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా మధురవాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన చేపట్టారు. కొమ్మాది జంక్షన్ నుంచి మధురవాడ వరకు ర్యాలీ నిర్వహించారు. తర్వాత కొమ్మాది వద్ద రాస్తోరోకో చేయడానికి రోడ్డుపై కొందరు నాయకులు బైఠాయించడంతో పీఎంపాలెం పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని పీఎంపాలెం పోలీసు స్టేషన్‌కి తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచి కత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటియూ నాయకులు పి. రాజ్‌కుమార్, కూటికుప్పల రాము, పి.సత్తిబాబు, ఎస్.ప్రసాద్, ఎం. రమణ, కుమార షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఏపీ వార్షిక సమావేశాలు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న నేషనల్ అకాడమీ ఆఫ్ సైకాలజీ (ఎన్ఏపీ) 33 వ వార్షిక సమావేశాలు శుక్రవారం ముగిశాయి. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మానసిక శాస్త్రవేత్తలు, పరిశోధకులు పలు ఆసక్తికర అంశాలు వెల్లడించారు. మితిమీరి శాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, ముఖ్యంగా సామాజిక మాధ్యమాలు, స్మార్ట్ ఫోన్ వినియోగం వల్ల చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు పలు రకాల మానసిక సమస్యలు ఏర్పడుతుండడంతో పాటు, నైపుణ్యాలు సహితం హరించుకుపోతున్నాయని పలువురు పరిశోధకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాగరన్ లేక్ సిటీ యూనివర్సిటీ పరిశోధకులు భరమ్‌బట్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన కాంక్రీట్ పలకలతో ఇబ్బందులు


సర్వీసు రోడ్డు మలుపులో గల డ్రైనేజీ దుస్థితి

పీఎం పాలెం: స్థానిక ఆఖరు బస్టాప్ నుంచి కారుషెడ్ కూడలి మీదుగా కొమ్మాది కూడలి వైపునకు వెళ్లే సర్వీసు రోడ్డు మలుపు ప్రమాద భరితంగా మారింది. డ్రైనేజీపై అమర్చిన కాంక్రీటు పలకలు శిథిలమవడంతో ఆ రోడ్డులో ప్రయాణించే వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి శిథిలమైన కాంక్రీట్ పలకలను మార్చాలని స్థానికులు కోరారు.

నేడు ఆలయ భూమిలో ఫలసాయానికి కౌలు వేలం పాట

పద్మనాభం: మండలంలోని పొట్నూరులోని కోదండ రామస్వామి ఆలయానికి చెందిన భూమిలో ఫలసాయం అనుభవించుటకు కౌలు నిర్ణయించేందుకు శనివారం వేలం పాట నిర్వహించనున్నట్టు ఈవో నానాజీ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నంబర్ 5/1లోని 7.38 ఎకరాల భూమిలో మామిడి తోట ఫలసాయాన్ని ఈ ఏడాది మార్చి 31 నుంచి డిసెంబర్ 31 వరకు అనుభవించుటకు గాను కౌలు నిర్ణయించేందుకు ఈ వేలం పాట నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద ఈ వేలం పాట నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు


ఆనందపురం జంక్షన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ తిరుపతిరావు, ట్రాఫిక్ ఎస్ఐ సునీల్

ఆనందపురం : మండల కేంద్రం ఆనందపురంలో శుక్రవారం స్థానిక పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సీఐ టి.వి.తిరుపతిరావు, ట్రాఫిక్ ఎస్ఐ సునీల్, సిబ్బంది... జంక్షన్‌లో వాహనాలను ఆపి తనిఖీ చేశారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలను ముమ్మరం చేశారు. జాతీయ రహదారితో పాటు విశాఖ, విజయనగరం, పెందుర్తి, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రహదారులు ఆనందపురం జంక్షన్‌కు అనుసంధానమై ఉన్నాయి. సంఘ వ్యతిరేక కార్యకలాపలాలకు పాల్పడేవారు, ఇతర నేరాలు చేసేవారు ఈ జంక్షన్ గుండా తప్పించుకునే అవకాశం ఉంది. వారిని ఇక్కడ నిలువరించే అవకాశం ఉండడంతో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ముఖ్యంగా నంబర్ ప్లేట్లు లేని, ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానం వచ్చిన వాహనాల రికార్డులను, డ్రైవర్ల పత్రాను పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి, రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ తిరుపతిరావు మాట్లాడుతూ రికార్డులు లేకుండా తిరుగుతున్న వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాల కంటబడితే వెంటనే సీజ్ చేస్తామన్నారు. ఆనందపురం జంక్షన్‌లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


మృతిచెందిన ఆదినారాయణ (ఫైల్)

పీఎం పాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ కాంతారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా రణస్థలానికి చెందిన డి.ఆదినారాయణ(40) కుటుంబంతో ఎండాడ ఎస్సీ కాలనీలో నివసిస్తున్నాడు. కుమార్తెకు వివాహం కాగా, ఇద్దరు కుమారులు చదువుతున్నారు.

నగరానికి ఉపాధి నిమిత్తం వలస వచ్చిన అయన తాపీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 13న భవననిర్మాణ పనికోసం ఆనందపురం వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఎండాడ దిశా పోలీస్ స్టేషన్ ఎదురుగా తాను నడుపుతున్న ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్రమైన గాయం కావడంతో రుషికొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

మళ్లీ పైప్‌లైన్ లీక్


కృష్ణంరాజుపేట వద్ద పైప్‌లైన్ లీకవుతున్న ప్రాంతం

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస పంచాయతీకి తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌కు శింగనబంధ పంచాయతీ కృష్ణంరాజుపేట వద్ద మళ్లీ పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో ఇక్కడ నీరు లీక్ అవుతూ ప్రవహించి మహారాజుపేట-పద్మనాభం రహదారిపై నిలిచిపోతోంది. ఈ నిలిచిన నీటిలో రాకపోకలు సాగిస్తున్న ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

గతంలో ఇక్కడే పైప్‌లైన్‌కు పగుళ్లు ఏర్పడితే గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి వదిలేశారు. ఇప్పుడు మళ్లీ ఇదే రహదారిపై పైప్‌లైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. ఈ పైపులైన్‌కు సక్రమంగా మరమ్మతులు నిర్వహించాలని వాహనదారులు, మజ్జివలస, శింగనబంధ పంచాయితీ వాసులు కోరుతున్నారు.

అబ్రహంకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి అభినందన


అబ్రహంను దుశ్శాలువాలతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షునిగా నియమితులైన పద్మనాభానికి చెందినదున్న అబ్రహంను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు భీమునిపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం దుశ్శాలువాతో సత్కరించి, అభినందించారు. తనను విశాఖ జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుని పదవికి ఎంపిక చేసిన వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, భీమునిపట్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావులకు అబ్రహం ధన్యవాదాలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆయన చెప్పారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ


బోర్డు మీద పదాలను విద్యార్థులతో చదివిస్తున్న డీఈవో చంద్రకళ

పద్మనాభం: మండలంలోని పలు పాఠశాలలను డీఈవో ఎల్.చంద్రకళ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బి.తాళ్లవలస ప్రాథమిక పాఠశాలలో ఒకటి, రెండు తరగతుల విద్యార్థులతో ఇంగ్లిషు పదాలను చదివించారు. బి.ఆర్.తాళ్లవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. వెంకటాపురం కల్లాలు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను, బి.తాళ్లవలస జెడ్పీఉన్నత పాఠశాలలో 5వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, విద్యార్థులు వెనుకబడిఉండడాన్ని గమనించారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

‘ముద్రా యోజన’తో మహిళలకు ప్రయోజనం


కార్యక్రమంలో పాల్గొన్న లీలారాణి

కొమ్మాది: మహిళల ఆర్థిక ప్రగతిలో ప్రధాన మంత్రి ముద్రా యోజన అత్యంత ప్రయోజనకారిగా నిలుస్తుందని ఏపీ చాంబర్ కామర్స్ మహిళా పారిశ్రామిక వేత్తల విభాగం అధ్యక్షురాలు ఎ.లీలారాణి అన్నారు. ముద్రా యోజన ద్వారా లబ్ధి పొందిన ఉత్తర కోస్తా జిల్లాల్లో మహిళా పారిశ్రామిక వేత్తలకు శుక్రవారం గీతంలో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గ్రామీణ మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో మహిళా పారిశ్రామిక వేత్తలకు మంచి భవిష్యత్తు ఉందన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీని తగ్గించి వారికి సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా..

- టాటా-ఎర్నాకుళం(08189) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19, 26 తేదీల్లో తెల్లవారు 5.15 గంటలకు టాటాలో బయల్దేరి అదే రోజు రాత్రి 8.43 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 8.45 గంటలకు బయల్దేరి మూడో రోజు మధ్య రాత్రి 1.55 గంటలకు ఎర్నాకుళం చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో ఎర్నాకుళంలో ఈ నెల 22, 29 తేదీల్లో ఉదయం 7.15 గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.08 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 12.10 గంటలకు బయల్దేరి మూడో రోజు వేకువజాము 4.35 గంటలకు టాటా చేరుకుంటుంది.
- కన్యాకుమారి-డిబ్రూఘడ్(06103) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16, మార్చి 1, 15, 29 తేదీల్లో (శుక్రవారాలు) సాయంత్రం 5.25 గంటలకు కన్యాకుమారిలో బయల్దేరి మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు విశాఖ వచ్చి, ఇక్కడ నుంచి 12.05 గంటలకు బయల్దేరి సోమవారాల్లో రాత్రి 8.50 గంటలకు డిబ్రూఘడ్ చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో డిబ్రూఘడ్- కన్యాకుమారి(06104) స్పెషల్ ఈ నెల 21, మార్చి 6, 20, ఏప్రిల్ 3 తేదీల్లో రాత్రి 7.55 గంటలకు డిబ్రూఘడ్‌లో బయల్దేరి మూడో రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు విశాఖపట్నం వచ్చి, అక్కడ నుంచి 3.50 గంటలకు బయల్దేరి శనివారాల్లో రాత్రి 9.55 గంటలకు కన్యాకుమారి చేరుకుంటుంది.
- కన్యాకుమారి-డిబ్రూఘడ్(06105) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26, మార్చి 8, 22, ఏప్రిల్ 5 తేదీల్లో(శుక్రవారాలు) సాయంత్రం 5.25 గంటలకు కన్యాకుమారిలో బయల్దేరి మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు విశాఖపట్నం వచ్చి, ఇక్కడ నుంచి 12.05 గంటలకు బయల్దేరి సోమవారాల్లో రాత్రి 8.50 గంటలకు డిబ్రూఘడ్ చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో డిబ్రూఘడ్- కన్యాకుమారి(06106) స్పెషల్ ఈ నెల 28, మార్చి 13, 27, ఏప్రిల్ 10 తేదీల్లో రాత్రి 7.55 గంటలకు డిబ్రూఘడ్‌లో బయల్దేరి మూడో రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు విశాఖపట్నం వచ్చి, ఇక్కడ నుంచి 3.50 గంటలకు బయల్దేరి శనివారాల్లో రాత్రి 9.55 గంటలకు కన్యాకుమారి చేరుకుంటుంది.

484 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: పెందుర్తి మండలం సరిపల్లి పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన లభించింది. శిబిరాల్లో మొత్తం 484మంది పేర్లు నమోదు చేసుకున్నారు. స్పెషలిస్టు వైద్యులు గైనకాలజిస్టు, జనరల్ మెడిసిన్,ఆర్థోపెడిక్,డెంటల్ వైద్యులు సేవలందించారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. వైద్య సేవల అనంతరం రోగులకు ఉచితంగా మందులు ఇచ్చారు. వైద్య శిబిరాన్ని నోడల్ అధికారి డాక్టర్ ఉమావతి సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

20న శిబిరాలు జరిగే ప్రాంతాలు

ఈనెల 20న భీమిలి మండలంలోని ఆర్.తాళ్లవలస సచివాలయం పరిధిలోని అమనాం, పద్మనాభం మండలంలో రేవిడి,ఆనందపురం మండలంలో పాలవలస గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరుగుతాయని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

తీరంలో భారీ టేకు చేప కళేబరం


సాగర్‌నగర్ తీరానికి కొట్టుకుని వచ్చిన టేకు చేప

కొమ్మాది: సాగర్‌నగర్ బీచ్ తీరానికి శుక్రవారం సాయంత్రం భారీ టేకు చేప కళేబరం కొట్టుకొచ్చింది. ఇది సుమారు 50 కేజీల బరువు ఉంటుందని, సముద్రంలో చలి తీవ్రత అత్యధికంగా ఉన్నప్పుడు ఇవి మృత్యువాత పడుతుంటాయని, దీని తోకలో విషం ఉంటుందని ఇక్కడ మత్స్యకారులు తెలిపారు. ఇక్కడకు వచ్చిన పర్యాటకులు ఆసక్తిగా సీ మృత టేకు చేపను తిలకించారు. మత్స్యకారులు వేటకు వెళ్లినప్పుడు అప్పుడప్పుడు ఇవి వలకు చిక్కుతాయని ఇక్కడ మత్స్యకారులు తెలిపారు.

మూడో అంతస్తు పైనుంచి పడి విద్యార్థికి తీవ్రగాయాలు

మధురవాడ: పీఎంపాలెం రామాలయం సమీపంలో ఓ భవనంలో ఉంటున్న విద్యార్థి మూడో అంతస్తు నుంచి కిందకి పడి తీవ్ర గాయపడ్డాడు. కె.అజయ్‌కుమార్ అనే బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి మరో ముగ్గురితో కలిసి ఇక్కడ ఒక భవనంలో అద్దెకు ఉంటున్నాడు. శనివారం సాయంత్రం మూడో అంతస్తు నుంచి కిందకి పడడంతో తలపై తీవ్రంగా గాయాలయ్యాయి. చికిత్స కోసం స్థానికులు విశాఖలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. విశాఖ నార్త్ జోన్ ఏసీపీ సునీల్, పీఎంపాలెం పోలీసు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ సంఘటన స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం ఆస్పత్రికి వెళ్లి విద్యార్థిని పరామర్శించి సంఘటనపై ఆరా తీస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

యువకుడిపై పోక్సో కేసు

మధురవాడ: అక్కయ్యపాలెంకు చెందిన యువకుడు బి.శివసాయి (21)పై పీఎంపాలెం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. మధురవాడ ప్రాంతంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన దళిత బాలిక(16)ను ప్రేమ పేరుతో శివసాయి కొద్ది రోజుల క్రితం తీసుకుపోయాడు. ఆచూకీ లభించడంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు పీఎంపాలెం పోలీసులు తెలిపారు.